క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయాలి

డిండి : నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం నుంచి నిర్వహించే యూటీఎఫ్ ఆరో విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, పవన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం రోజు నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

తడకమళ్లలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని తడకమళ్ల గ్రామంలో శుక్రవారం ఆపోలో రీచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేశారు. అనంతరం వారిని పరీక్షించిన వైద్యులు మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపోలో రీచ్ వైద్యులు మల్లికార్జున్, నవీన్, రవికిరణ్, కరుణాకర్, వైద్య సిబ్బంది జటంగి సైదులు, మహేష్, గ్రామస్తులు జిల్లా నగేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దవూర: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచితంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సామాజిక వాదుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు అమిత్‌షా క్షమాపణ చెప్పడం గాని, పదవికి రాజీనామా చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తగరం శ్రీను, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు ఆడెపు నాగార్జున, కుక్కమూడి ముత్యాలు, తరి పెద్దనాగయ్య, నరేందర్, పరమేష్, నాగయ్య, సైదులు, ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న నాగన్నగౌడ్, తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపిక



టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటుకు ఎంపికైనట్లు జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. జనగామలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు మాలావత్ రాముడు, బత్తుల రవితేజ, బాణావత్ సైదులు, షేక్ జావిద్ పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జోరుగా యాసంగి సాగు

- 1.10లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- సన్నరకం వైపు రైతుల మొగ్గు
- ఇప్పటికే నార్లు పోసుకున్న అన్నదాతలు



హాలియాలో రైతు సాగు చేస్తున్న సన్నరకం వరి నారుమడి



పొలంలో నాట్లు వేస్తున్న మహిళలు

హాలియా : సాగర్ నియోజకవర్గంలో యాసంగి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఆయకట్టు, నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు 1.10 లక్షల ఎకరాలకుపైగా వరిసాగు చేయనున్నట్లు అధికార యంత్రాంగం ఇప్పటికే అంచనా వేసింది. ఆయకట్టులో వరిసాగుకు వారబంధి కింద నీటిని విడుదల చేసేందుకు అధికారురలు ఇప్పటికే ఖరారు చేశారు. గతేడాది చెరువులు, కుంటల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి అన్నదాతలకు వరిసాగు భారంగా మారింది. కానీ ఈ సీజన్‌లో వర్షాలు విరివిగా కురవడంతో సాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరదనీరు భారీగా వచ్చి చేరింది. దీంతో ఆయకట్టు పరిధిలోని రైతాంగానికి వానాకాలం, యాసంగి సీజన్లలో వరినాట్లు వేసేందుకు నీటికి ఎలాంటి ఢోకాలేకపోవడంతో పాటు నియోజకవర్గంలో కురిసిన వర్షాలకు అన్ని మండలాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరి భూగర్భ జలాలు పెరిగి బోర్లు బాగా పోస్తున్నాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరగడంతో యాసంగి సీజన్‌లో ఆయకట్టు ప్రాంతంతో పాటు నాన్ ఆయకట్టు ప్రాంతంలోని రైతులు వరినాట్లు వేస్తున్నారు.

వరిసాగు పెరిగే అవకాశం

సాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు, నాన్ ఆయకట్టు పరిధిలో యాసంగి సీజన్‌లో 1.10 లక్షల ఎకరాలకుపైగా వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 30వేల ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం, మరో 80 వేల ఎకరాలకుపైగా సన్నాలు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో సన్నాల సాగు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. యాసంగి సాగుకు అనుగుణంగా రైతులకు కావాల్సిన వరి విత్తనాలను ఆగ్రోస్, ఇతర విత్తనాల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ఇందులో సన్న రకమైన 101, కావేరి చింట్లు, హెచ్ఎంటీ, చిట్టి పొట్టి, ఆర్ఎన్ఆర్, 606, 505, పద్మ, దొడ్డు రకం 1010 వంటి విత్తనాలను ఎక్కువగా కొనుగోలు చేసి రైతులు నార్లు పోశారు. దొడ్డు రకం సాగుచేస్తే పంటను అమ్ముకునే సమయంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుందని భావించిన రైతులు సన్నరకం వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

సాగు విస్తీర్ణం పెరగనుంది



ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండడంతో 70శాతం రైతులు సన్న రకం ధాన్యం సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే కొంతమంది నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం వరినాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులకు ఎరువులను ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచాం. జింకు లోపం లేకుండా, పైరు ఎర్రపడకుండా రైతులు తగు జాగ్రత్తలను తీసుకోవాలి, తూర్పు, పడమర దిశగా నాట్లు వేసుకుంటే సస్యరక్షణకు అనుకూలంగా ఉంటుంది.

– సరిత, అనుముల మండల వ్యవసాయ అధికారి

పుట్టలగడ్డలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్రకుమార్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని పుట్టలగడ్డలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శుక్రవారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర కుమార్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని,ల ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపి, నాయకుల రూపావత్ శ్రీరాం నాయక్, రాంరెడ్డి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

వర్గీకరణ అమలయ్యేంత వరకు పోరాటం



సమావేశంలో పాల్గొన్న మాదిగ సంఘాల నాయకులు

దేవరకొండ : ఎస్సీ వర్గీకరణ అమలయ్యేంత వరకు పోరాటాలు చేయాలని మాదిగ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం దేవరకొండ టీటీడీ కల్యాణ మండపంలో వివిధ మాదిగ సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాదిగ రాజకీయ, కుల, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, న్యాయవాద, జర్నలిస్ట్ సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. వచ్చే ఏడాది జనవరి 5న మరోసారి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, జనవరి చివరి వారంలో దక్షిణ తెలంగాణ మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వెంకటయ్య, ముదిగొండ ఏలేష్,శ్రీను, కృష్ణయ్య, సహదేవ్,ఎర్ర కృష్ణ, యాదగిరి, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు



చింతపల్లి : నాగార్జున మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : మండల పరిధిలోని వింజమూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఇరిగి నాగార్జున మృతి ఆ పార్టీకి తీరని లోటని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం వింజమూరులో నాగార్జున మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగార్జున కుటుంబ సభ్యులను పమర్శించారు. ఆయన వెంట దండేకర్ ప్రసాద్, రాధాక్రిష్ణ, జంగయ్య, బిచ్యానాయక్, కోటేష్, మురళీ, విజయ్ ఉన్నారు.

ద్వాలి మృతి బాధాకరం

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పుట్టంగండి గ్రామానికి చెందిన ద్వాలి మృతి బాధకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ద్వాలి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, ఎర్ర యాదగిరి ,రాయినబోయిన శ్రీను, కర్నాటి రవికుమార్, వెంకట్రావ్, బీమా, సర్యానాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక



సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి : మండల పరిధిలోని తీదేడులో 47, 48 బూత్ నూతన కమిటీలను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు గణేష్, శివర్ల ప్రవీణ్ యాదవ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు గారు మాట్లాడుతూ పార్టీలో కనీసం 25 సభ్యత్వాలు చేసి క్రియాశీలక సభ్యత్వం పొందితేనే గ్రామ బాధ్యతల నుంచి రాష్ట్ర బాధ్యత వరకు అర్హుడు అన్న విషయాన్ని కార్యకర్తలు గుర్తించుకోవాలన్నారు. మండలంలోని సీనియర్ నాయకులు , మాజీ ప్రజాప్రతినిధులు క్రియాశీలక సభ్యత్వం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధరణి పతి రమణారావు, రమేష్ యాదవ్, గజ్జ అభినవ్ గౌడ్, ఐతగోని శివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య గౌడ్ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై వేగ నియంత్రణ సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలోని గోపాలపురం నుంచి బూరుగడ్డకు యూటర్న్ తీసుకునే ప్రాంతంలో వేగ నియంత్రణ, సూచిక బోర్డులు లేకపోవడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే, పోలీస్ అధికారులు జాతీయ రహదారిపై వేగనియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి



మిర్యాలగూడ : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, తదితర నాయకులు



హాలియా : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్తగా డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం దురదృష్టకరమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఆయన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే దామరచర్లలో మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పగిడి జీడయ్యయాదవ్, దాసు, ఆకారం గోపాల్, వసంత్, శివకుమార్, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, రాజు, సైదులు, మంతనాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, జయరాం, వేణు, సుమన్, వైఎస్ఎన్ రెడ్డి, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, చంద్రకాంత్, సలీం, ఏసు, రాజా, విగ్నేష్, నాగరాజు, రఘునందన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దామరచర్లలో..



నాగార్జునసాగర్‌లో..

హాలియా : అనుముల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా పట్టణంలో ఆ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాకునూరి నారాయణ గౌడ్, నాయకులు ఆంజనేయులు, సైదులు, శ్రీనివాస్, శ్రీను, వెంకట్‌రెడ్డి, పాండునాయక్, మజహార్ మోహినిద్దీన్, కృష్ణ, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ దార్శనికత దేశానికే ఆదర్శప్రాయం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దార్శనికత దేశానికే ఆదర్శప్రాయం అని, ఆయన మరణం దేశానికే తీరని లోటని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక శాఖ మంత్రిగా దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఆర్థికవేత్తగా, అధ్యాపకుడిగా, రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశాభివృద్ధిలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

సాయుధ పోరాటంలో రంగాపురానిది కీలక పాత్ర



సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాటంలో రంగాపురం గ్రామం కీలక పాత్ర పోషించిందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఐ ఆవిర్భవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో రంగాపురం పాత్ర గురించి పుస్తకాల్లో చరిత్ర నిక్షిప్తమై ఉందని అన్నారు. లక్షలాది మంది వీరుల త్యాగాల ఫలితంగానే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. నల్లగొండలో ఈ నెల 30న జరిగే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి తిరగమళ్ల కిరణ్, కట్టా అశోక్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మెండె లింగరాజు, బాలషౌరి సతీష్, నవీన్, రాయప్ప, పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



మిర్యాలగూడ : దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



దేవరకొండ : మాట్లాడుతున్న రామస్వామి



పెద్దవూర : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, జైరుద్దీన్, సైదులు, బంటు, నాగయ్య, జోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దవూర : అరకొర వేతనాలతో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ గ్రాంటు ద్వారా నేరుగా వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం పంచాయతీ కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. . అంతకుముందు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మంగారెడ్డి, కన్వీనర్ రామకృష్ణ, కార్యదర్శి మైనుద్దీన్, కార్మికులు ప్రభాకర్, అంజిరెడ్డి, సంతోష్, లక్ష్మమ్మ, శంకర్, పాపమ్మ, కేశవులు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దేవరకొండ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెలకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని, కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మల్లయ్య, జవహర్, వీరయ్య, దేవరరాజ్, బోజ, అయోధ్య, ఇద్దయ్య, వెంకటమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట మాజీ ప్రధాని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ టౌన్: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రాష్ట్ర నాయకత్వంతో చర్చించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. దీక్షకు టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మురళి శేఖర్‌రెడ్డి , రాజు, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, ఎడ్ల సైదులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు క్రాంతికుమార్, మొల్గురి కృష్ణ, బొమ్మగాని రాజు, సావిత్రి, పాండు నాయక్, రహీం,నాగయ్య, వెంకటేశ్వర్లు, లలిత రమేష్ కుమార్, కొండయ్య, నిరంజన్, లింగయ్య , యాదగిరి, నీలాంబరి, వసంత, గుమ్మల మంజుల, కొండ చంద్రశేఖర్, పుష్పలత, చెందపాక నాగరాజు, రవి ,సాయిలు, పరమేష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నేరేడుచర్ల వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నేరేడుచర్ల : పట్టణంలో శుక్రవారం వాసవీ క్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను నేరేడుచర్ల వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఈగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అయిత కృష్ణసుమంత్, కోశాధికారిగా నకిరేకంటి వంశీకృష్ణ, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వాసవీ క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి.. కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతులు పొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

హుజూర్‌నగర్ : క్రిస్మస్ సందర్భంగా హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో అంబేద్కర్ లయన్స్, మహాత్మా జ్యోతిరావు పూలే సంఘాల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మున్సిపల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ పోటీలలో మొత్తం పది టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు. సామరాజు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి కోలనాగేశ్వరరావు టీమ్‌లు గెలుపొందాయి. విజేతలను క్రీడల కమిటీ చైర్మన్ భాస్కర్ అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధనుంజయ్, కౌన్సిలర్ సౌజన్య ధనుంజయ, అంపైర్ బి.వినోద్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది



పోగొట్టుకున్న సంచి, డబ్బులను అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు, డ్రైవర్, కండక్టర్లు

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సంచితో పాటు డబ్బులను బాధితులకు అందజేసి నిజాయితీ చాటుకున్నారు ఆర్టీసీ సిబ్బంది. వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన గుత్తా కరుణ ఈనెల 26న ముసలమ్మ చెట్టు స్టేజి వద్ద దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వెళ్లే మిర్యాలగూడ డిపో పల్లె వెలుగు బస్సు ఎక్కింది. మార్గమధ్యంలో ఆమె హాలియాలో దిగింది. కరుణ బస్సులో తన వెంట తెచ్చుకున్న సంచిని మరిచి అందులోనే వదిలి వెళ్లింది. డిపోకు వెళ్లిన అనంతరం డ్రైవర్, కండక్టర్లు గుర్తించి సంచిని డిపో సెక్యూరిటీ జానకిరాంరెడ్డికి అప్పగించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ సంచిని తెరిచి చూడగా అందులో రూ.16వేల నగదుతో పాటు అర తులం బంగారం, రెండు కనిపించాయి. ఈ విషయంపై బాధితురాలికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి డిపోకు రాగానే సంచితో పాటు అందులోని బంగారం, నగదు డబ్బులను అప్పగించారు. దీంతో ఆర్టీసీ సిబ్బందికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

- హౌసింగ్ బోర్డు కాలనీలో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



హౌసింగ్ బోర్డు కాలనీలో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

మిర్యాలగూడ అర్బన్ : గాలివానలకు తట్టుకునేలా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలు గుంతలో పాతిన మరునాడే పక్కకు ఒరిగిపోతున్నాయి. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏ విధంగా పనుల్లో నాణ్యత పాటిస్తున్నారో అర్థమవుతుంది. పలు కాలనీల్లో పాడైన, ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు పనుల నాణ్యతను పరిశీలించడం లేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా గుంతలు తీసి స్తంభాలు పాతుతున్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పాత స్తంభంతో ఇన్ని రోజులు ఇబ్బంది పడ్డా ప్రజలు మళ్లా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి వైర్లు కూడా బిగించకముందే ఒరగడంతో గాలి వానకు ఎలా తట్టుకుటుందోనని ఆ కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు పనులు జరుగుతున్న కాలనీల్లో పర్యటించి నాణ్యతపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.